బల్లి, తొండ, ఉడుత పాయె.. ఈ సారి ఉడుము వంతు!

- బోడుప్పల్ సీపీఆర్ఐలోకి ఉడుము
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- వెంటనే ఉప్పల్ ఫీడర్ నుంచి పునరుద్ధరణ
- ఫీడర్ మరమ్మతులు చేస్తున్న అధికారులు

ఉప్పల్ సమీపంలోని సీపీఆర్ఐ ప్రాంగణంలో ఉన్న బ్రేకర్‌లోకి వచ్చిన ఉడుము

హైదరాబాద్ సిటీబ్యూరో,ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు రోజుకో సమస్య వస్తున్నది. ఇప్పటివరకు బల్లి, తొండ, ఉడుత విద్యుత్ అంతరాయానికి కారణం కాగా ఈసారి ఉడుము వంతొచ్చింది. బోడుప్పల్ సమీపంలోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీపీఆర్ఐ) ప్రాంగణంలోని ఒక బాక్సులోని బ్రేకర్‌లోకి ఉడుము వెళ్లడంతో పీఅండ్‌టీ కాలనీ 11కేవీ ఫీడర్ ట్రిప్ అయింది. దీంతో ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 4-5 నిమిషాలపాటు ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని, వెంటనే ఉప్పల్ ఫీడర్ పరిధి నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని హబ్సీగూడ సర్కిల్ ఎస్ఈ పీ బ్రహ్మం తెలిపారు. విద్యుత్ పరిశోధన కేంద్రమైన సీపీఆర్ఐలోనే ఈ ఘటన జరగడంతో లోపల విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతిందని, దాన్ని అక్కడి అధికారులు గుర్తించి సరిచేస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో 'రైస్ ఏటీఎం'లు?

- కొత్తగా రేషన్ బియ్యం పంపిణీ
- ప్రయోగాత్మకంగా ఒడిశాలో అమలు
- రాష్ట్రంలో ఏర్పాటుకు సన్నాహాలు
- 20 మంది డీలర్లకు ఢిల్లీలో శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ):రాష్ట్రంలో 'రైస్ ఏటీఎం'లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతున్నది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే దాదాపు 20 మంది రేషన్ డీలర్లను ఢిల్లీకి పంపి, శిక్షణ ఇప్పించినట్టు తెలిసింది. రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని మార్చడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైస్ ఏటీఎంను ప్రవేశపెట్టింది. 3 రోజుల క్రితం ఒడిశాలో ప్రయోగాత్మకంగా దీన్ని ప్రారంభించారు. దశలవారీగా దేశమంతటా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే తెలంగాణలోనూ రైస్ ఏటీఎంలను ప్రవేశపెట్టనున్నట్టు తెలిసింది.

ఎలా పనిచేస్తుందంటే..

ఏటీఎం నుంచి డబ్బులు తీసుకునేందుకు పిన్ నంబర్ ఎంటర్ చేసినట్టుగా రైస్ ఏటీఎంలో రేషన్‌కార్డు నంబర్‌ను ఎంటర్ చేయగానే కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా రేషన్ బియ్యం వస్తాయి. రైస్ ఏటీఎంలను ఏర్పాటు చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే రైస్ ఏటీఎంల ఏర్పాటు అంశాన్ని గోప్యంగా ఉంచుతున్నది. ఇటీవల దాదాపు 20 మంది రేషన్ డీలర్లను ఢిల్లీకి తీసుకెళ్లి రహస్యంగా శిక్షణ ఇప్పించినట్టు సమాచారం. కానీ, విషయం బయటకు తెలియడంతో మల్టీస్టోర్ షాపులను కొనసాగించేందుకు అవసరమైన శిక్షణ ఇప్పించినట్టు అధికారులు చెప్తున్నారు. దీంతో ఆ మాత్రం దానికి ఢిల్లీ వరకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఏమొచ్చిందని పలువురు రేషన్ డీలర్లు ప్రశ్నిస్తున్నారు.

సుంకిశాల చక్రం తిప్పిందెవరు?

మొదటిపేజీ తరువాయి...

చర్చ జరుగుతున్నది. అసలు సుంకిశాల వ్యవహారానికి సంబంధించి పురపాలకశాఖలో ఎవరు చక్రం తిప్పారు? అనేది ప్రధాన అంశంగా మారింది. తొలుత అంతా తానై అన్నట్టు వ్యవహరించిన ప్రభుత్వ పెద్ద.. ఒక్కసారిగా తనకు సంబంధం లేనట్టుగా వ్యవహరించటం ఓ ఉన్నతాధికారిని కాపాడే ప్రయత్నంలో భాగమేనని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఇప్పటిదాకా ఘటనపై ఎలాంటి సమీక్ష నిర్వహించకపోవటంతో పాటు ఏజెన్సీ, ఇంజినీర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేలా, చిన్న సంఘటనగా చిత్రీకరించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఏజెన్సీపై ఎందుకు చర్య తీసుకోవటం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఇప్పటి దాకా సమీక్షే లేదు

నల్లగొండ జిల్లాలోని సుంకిశాల పథకంలో రిటైనింగ్ వాల్ నిలువునా కుప్పకూలిన ఘటనపై తెరవెనుక నాటకీయంగా పావులు కదులుతున్నాయి. ఇంత పెద్ద ఘటన జరిగినా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి తెలియకపోవటంపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవంగా ఈ వ్యవహారం పురపాలకశాఖ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం ఆ పోర్ట్ ఫోలియో సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నది. ఆయన అందుబాటులో లేనందున పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి రంగంలోకి దిగి, సమీక్షించాల్సి ఉన్నది. కానీ అదేమీ జరగలేదు. 'నమస్తే తెలంగాణ' ఈ సంఘటనను ఈ నెల 8న వెలుగులోకి తెచ్చింది. అదే రోజు సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జలమండలి ఎండీతో పాటు ఇతర ఇంజినీర్లను పిలిపించుకొని మాట్లాడారు. అంటే సీఎం అందుబాటులో లేనందున డిప్యూటీ సీఎం రంగంలోకి దిగారని అనుకోవచ్చు. మరుసటి రోజు సుంకిశాలకు మంత్రులు ఉత్తమ్, తుమ్మలతో కలిసి భట్టి వెళ్తున్నారంటూ మీడియాకు అధికారికంగానే సమాచారం వచ్చింది. కానీ చివరి నిమిషంలో భట్టి ఆ పర్యటనకు దూరంగా ఉండటం గమనార్హం. సీఎం అందుబాటులో లేనందున ప్రభుత్వపరంగా వ్యవహారాన్ని భుజాన వేసుకున్నారని అనుకున్నా.. మరుసటి రోజు చివరి నిమిషంలో పర్యటన రద్దు చేసుకోవటంతో పాటు ఇప్పటివరకు ఈ వ్యవహారంపై సమీక్ష కూడా చేయలేదు. ఘటనను గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేసేందుకే తీవ్రంగా ప్రయత్నం జరిగింది. జలమండలి అధికారిక వివరణతో అది బూమరాంగ్ అవడంతో మిన్నకుండిపోయినట్టు తెలుస్తున్నది. తాను పర్యటనకు వెళితే సంఘటన వ్యవహారం మరింత కొనసాగింపుగా మారుతుందనే ఉద్దేశంతోనే భట్టి సుంకిశాల పర్యటనకు దూరంగా ఉన్నారనే వ్యాఖ్యలు వినిపించాయి. అటు తుమ్మల, ఇటు ఉత్తమ్.. ఇద్దరూ జరిగిందేదో జరిగింది, ఏజెన్సీదే బాధ్యత. ప్రభుత్వంపై భారం లేదంటూ, దాన్ని చిన్న సంఘటనగా చిత్రీకరించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. మరుసటి రోజు నుంచి అటు ఇంజినీర్లు, ఇటు ఏజెన్సీ.. ఎవరిపైనా చర్య తీసుకోలేదు. పైగా ఈ సంఘటనపై వేసిన త్రిసభ్య కమిటీ వెంటనే నివేదిక ఇస్తుందని చెప్పినా నిర్ణీత గడువు ఇచ్చారా? లేదా? అనేది వెల్లడించలేదు. కమిటీ వేసి ఐదు రోజులైనా ఇప్పటివరకు నివేదిక కూడా రాలేదు. కేవలం ముగ్గురు ఇంజినీర్లకు మెమోలు జారీ చేసి, వారి నుంచి సంజాయిషీ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వ్యవహారాన్ని పూర్తిగా మూసివేసేందుకే వేగంగా అడుగులు పడుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా ఒక ఉన్నతాధికారిని వెనకేసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే డిప్యూటీ సీఎం తొలుత హడావుడి చేసి ఆపై మిన్నకుండిపోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ వ్యవహారంలో అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఘటనపై విచారణ కమిటీ వేస్తామని అందరి కంటే ముందుగా ప్రకటించిన పొన్నం ప్రభాకర్.. ఇన్‌చార్జి మంత్రి హోదాలో కనీసం సమీక్ష చేయకపోవటం, సంబంధిత ఇంజినీర్లతో మాట్లాడటం గానీ చేయలేదు. జలమండలి ఇంజినీర్లతో మాత్రమే కమిటీ ఏర్పాటుచేసి బాధ్యులందరినీ కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమిటీనైనా స్పష్టత ఇస్తుందా?

సుంకిశాల ఘటనపై జలమండలి అధికారులు ఇచ్చిన వివరణలో స్పష్టంగా ఇది ఏజెన్సీ తప్పిదమేనని పేర్కొన్నారు. కానీ ఇది నాన్‌ఈపీసీ కింద అప్పగించిన పనులు అనే వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. ఈపీసీ అంటే ఏజెన్సీనే సర్వే, డిజైన్ రూపొందించి, పనులు పూర్తి చేసి, ప్రాజెక్టును ప్రభుత్వానికి అప్పగిస్తుంది. ఇందులో సంబంధిత శాఖ ఇంజినీర్ల పాత్ర ఉండదు. కానీ నాన్‌ఈపీసీ పనుల్లో ఏజెన్సీ పనులు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. కీలక నిర్ణయాలన్నీ ఇంజినీర్లే తీసుకుంటారు. పనుల్లో వినియోగించే స్టీల్, సిమెంట్‌ను సైతం ఇంజినీర్లు ధ్రువీకరించిన తర్వాతే వినియోగిస్తారు. ఈ క్రమంలో మధ్యస్థ సారంగాన్ని జలమండలి ఇంజినీర్లు చెప్తేనే ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఏజెన్సీ స్వతహాగా చేయడానికి వీలుండదు. అంతేకాదు.. మంత్రుల బృందం పర్యటన సందర్భంగా కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘటన జరిగినప్పటికీ పథకం పూర్తి కాలేదని, పూర్తి చేసి అప్పగించాల్సిన బాధ్యత ఏజెన్సీపైనే ఉంటుందని, ప్రభుత్వంపై భారం ఉండదని వెల్లడించారు. ఇలా ఈపీసీ పనుల్లోనే జరుగుతుంది. సుంకిశాల నాన్‌ఈపీసీ అయినప్పటికీ ప్రభుత్వం, ఇంజినీర్లు తమకేం సంబంధం లేదన్నట్టు వ్యవహరించటం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. త్రిసభ్య కమిటీనైనా.. నాన్‌ఈపీసీ అని చెప్తుందా? లేక ఏజెన్సీదే బాధ్యత అంటూ చేతులు దులుపుకుంటుందా? అన్నది వేచి చూడాల్సిందే.

10 రోజులైనా 'సుంకిశాల'పై చర్యలేవి?

- 'మేఘా'పై ఎందుకు మెతక వైఖరి
- అసలు మీ తెలంగాణ కాంగ్రెస్ ఉద్దేశమేంటి?
- రాహుల్‌గాంధీని ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): సుంకిశాల గోడ కూలిన ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రమాదం జరిగి 10 రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కాంట్రాక్టు సంస్థే కారణమైతే దాన్ని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ వేయాలని ఇప్పటికే కోరినట్టు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన కాంట్రాక్ట్ ఏజెన్సీ మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థ పట్ల ఎందుకంత మెతక వైఖరి ప్రదర్శిస్తుందో సమాధానం చెప్పాలని నిలదీశారు.

ఇంజినీర్ల వివరణ కోరిన ఎండీ

సుంకిశాల ఘటనతో జలమండలి మేల్కొన్నది. సంస్థ ఈడీ డాక్టర్ ఎం సత్యనారాయణ, ఈఎన్సీ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌తో కమిటీ వేస్తూ ఎండీ అశోక్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.నిర్లక్ష్యంగా అధికారులను ప్రాథమికంగా గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఘటనకు తమదే బాధ్యత అని ఏజెన్సీ చెప్పినప్పటికీ.. కమిటీ నివేదిక అంటూ సదరు కాంట్రాక్టర్‌పై చర్యల విషయంలో తాత్సరం చేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు

సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణం, ప్రమాద ఘటన వెనుక అధికారుల లోపాలను ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. గతంలో జలమండలి చేపట్టిన హడ్కో తాగు, మురుగునీటి ప్రాజెక్టు, 21 చోట్ల ఎస్టీపీ పనులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగాయి. సీసీ కెమెరాలను ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేసి ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీలు పర్యవేక్షించారు. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో మాత్రం అధికారులు ఇవేవీ చర్యలు తీసుకోలేదు. దీంతో ఘటన జరిగిన తర్వాత మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలకు జలమండలి ఉపక్రమించింది. త్వరలోనే సుంకిశాల తాగునీటి ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు.

బీజేపీ మత్తులో మందకృష్ణ

- ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం: చెన్నయ్య

హైదరాబాద్ (ఖైరతాబాద్) ఆగస్టు 12: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాల ప్రజాప్రతినిధులపై విషంకక్కుతున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్న య్య ఆరోపించారు. హైదరాబాద్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే మాదిగల్లో అక్షరాస్యత లేని, అభివృద్ధి చెందని కుటుంబాలకు సమాన అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వర్గీకరణ అనే ది చివరకు రిజర్వేషన్ల రద్దుకే దారి తీస్తుందని తెలిపారు. బీజేపీ, ఏపీ సీఎం చంద్రబాబు మత్తులో నుంచి మందకృష్ణ బయటకు వచ్చి దళితుల ఐక్యతకు కృషి చేయాలన్నారు. వర్గీకరణను అడ్డుకొని తీరుతామని, సుప్రీం కోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా త్వరలోనే జాతీయస్థాయిలో ఆందోళనలు చేపడుతామని వెల్లడించారు.

సుప్రీం తీర్పు ఏ కులానికీ వ్యతిరేకం కాదు

- మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు12 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఏ కులానికీ వ్యతిరేకం కాదని మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ తీర్పులో సామాజిక న్యాయం కనిపిస్తున్నదని చెప్పారు. ఎస్సీల్లోని అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు రావాలనే అంబేద్కర్, పూలే కోరుకున్నారని వెల్లడించారు. సుప్రీం తీర్పులో కూడా ఇదే విషయం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పుడు ఎస్సీల్లోని అన్నికులాల మేధావులందరూ కలిసి చర్చించుకుని, ఇప్పటి వరకు అవకాశాలు రాని వారికి అవకాశాలు రావడానికి ఏం చేయాలో ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉన్నదని సూచించారు. 15 శాతమున్న రిజర్వేషన్‌ను 20 శాతానికి పెంచుకోవడానికి కలిసి పోరాడుదామని కోరారు.

రెండేండ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను వచ్చే రెండేండ్లలో పూర్తిచేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి.. సోమవారం ఒహయోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మానుఫ్యాక్చరింగ్ కంపెనీని సందర్శించి సీఈవో లాక్ హోంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టన్నెల్ తవ్వకానికి ఉపయోగించే అధునాతన నిర్మాణ యంత్ర సామగ్రిని సీఈవో లాక్‌హోం మంత్రికి వివరించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు బేరింగ్ సమస్యతోపాటు ఇతర మరమ్మతుల వల్ల ఆగిపోయాయని, పరికరాలను వీలైనంత త్వరగా అందించాలని సీఈవోను మంత్రి కోమటిరెడ్డి కోరారు. గ్రీన్ చానల్ అమలులో ఉన్నందున పనులు జరిగిన 40 రోజుల్లోనే చెల్లింపుల అంశంపై మంత్రి వివరించారు. కార్యక్రమంలో సాగునీటి పారుదల శాఖ నల్లగొండ సీఈ వీ అజయ్‌కుమార్, జైప్రకాశ్ అసోసియేట్ కంపెనీ డైరెక్టర్ పంకజ్ గౌర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

గోల్కొండలో స్వాతంత్ర్య వేడుకలు

- పటిష్ఠ ఏర్పాట్లకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోటపై పటిష్ఠ ఏర్పాట్లుచేయాలని అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ఆమె గోల్కొండ కోటను సందర్శించారు. వేడుకల్లో మన సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా సంప్రదాయ దుస్తులలో కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ తెలిపారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను సీఎస్ ఆదేశించారు.కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

బదిలీల్లో అక్రమాలపై గప్‌చుప్!

- వైద్యారోగ్య శాఖపై సర్కారుది విచిత్ర పరిస్థితి
- డీపీహెచ్ పరిధిలో బదిలీల రచ్చపై మౌనం
- విజిలెన్స్ విచారణ అంటూ మంత్రి హడావుడి
- ఇప్పటివరకు కనిపించని 'నష్టనివారణ' చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఆరంభ శూరత్వంగానే కనిపిస్తున్నది. వివిధ శాఖల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై తొలుత హడావుడి చేస్తున్నా, ఆ తర్వాత కిమ్మనని పరిస్థితి దాపురించింది. దీనికి ఇటీవల వైద్యశాఖలో జరిగిన బదిలీలపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ స్పందన నిదర్శనంగా నిలుస్తున్నది. వైద్యారోగ్యశాఖ పరిధిలో డీపీహెచ్ మినహా ఇతర ఏ విభాగంలోనూ ఆరోపణలు రాకపోవడం గమనార్హం. బదిలీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తామంటూ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హడావుడిగా ప్రకటన చేశారు. అయినా ఇప్పటివరకు నష్టనివారణ చర్యలు తీసుకోవడమే లేదు. కనీసం డీపీహెచ్ గానీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గత ప్రభుత్వం 2018లోనూ ఇదే తరహాలో బదిలీలు చేపట్టినా ఎలాంటి ఆరోపణలు రాలేదని ఉద్యోగులే గుర్తు చేస్తున్నారు. డీపీహెచ్ విభాగంలో నర్సింగ్ ఆఫీసర్లు మొదలు డిప్యూటీ డైరెక్టర్ వరకు దాదాపు అన్ని హోదాల్లోనూ బదిలీలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలు ఏకంగా కౌన్సెలింగ్‌ను బహిష్కరించి, కోఠిలో రాస్తారోకో చేసే స్థాయికి దారితీసింది. సీనియార్టీ జాబితా, వేకెన్సీ జాబితాలో తప్పులు దొర్లాయని నర్సులు ఆరోపించారు. దీంతో మొదట మార్పులు చేసి, రెండోసారి జాబితా విడుదల చేశారు. అయినా తప్పులు దొర్లడంతో మరోసారి రివైజ్ చేశారు. ముచ్చటగా మూడోసారి కూడా ఆరోపణలు రావడంతో ఏకంగా కౌన్సెలింగ్‌నే ఆపేశారు.

చనిపోయిన వ్యక్తినీ బదిలీ చేశారు!

ల్యాబ్ అసిస్టెంట్ల బదిలీలపైనా పలు ఆరోపణలు వచ్చాయి. ఫోకల్ టు నాన్ ఫోకల్ పాటించలేదని, సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉన్నదని ఆరోపణలొచ్చాయి. టీవీవీపీ ఉద్యోగులను డీపీహెచ్ ఉద్యోగులుగా మార్చి బదిలీ చేశారని, చనిపోయిన వ్యక్తిని కూడా బదిలీ చేశారన్న ఆరోపణలు ఇలా ఎన్నో వెల్లువెత్తాయి. డిప్యూటీ డైరెక్టర్ అడ్మిన్ బదిలీలను కండ్లు మూసుకొని చేశారనే స్థాయిలో ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న అధికారులకు పక్క ఆఫీస్‌లో పోస్టింగ్‌లు ఇవ్వడం దుమారం రేపింది. అర్హత లేని సంఘాల నేతల సిఫారసు లేఖలపైనా దుమారం చెలరేగింది.

సీఎంవో ఆరా తీసినా విచారణేదీ?

వైద్యశాఖలో బదిలీల్లో జరిగిన రచ్చపై సీఎంవో ఆరా తీసినట్టు ఆనాడే వార్తలొచ్చాయి. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో నర్సింగ్ కౌన్సెలింగ్‌ను నిలిపివేసి, రోడ్డుపైకి వచ్చి నిరసన తెలపడానికి గత కారణలను తేల్చాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు నివేదిక అందిందని అప్పట్లో సచివాలయ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత వైద్యశాఖ బదిలీల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గత నెల 27న ప్రకటించారు. బదిలీల్లో అవకతవకలకు పాల్పడినట్టు తేలితే.. వారు ఏ స్థాయి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. తప్పిదాలకు పాల్పడినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని డీపీహెచ్ రవీందర్‌నాయక్ కూడా స్పష్టం చేశారు. కానీ రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి విచారణ జరగలేదు. ఈ వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉండటం వల్లే అటు ప్రభుత్వం గానీ, ఇటు ఆ శాఖ ఉన్నతాధికారులు గానీ గప్‌చుప్‌గా ఉన్నారని ఆరోపణలు వస్తున్నాయి.

కాంగ్రెస్‌లో మహిళలకు న్యాయమేది?

- జెండాలు మోసినవాళ్లకు గుర్తింపు లేదా?
- రాహుల్‌గాంధీ చెప్తున్న 'నారీ న్యాయ్' ఇదేనా?
- నిలదీసిన పార్టీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో మహిళలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్తున్న 'నారీ న్యాయ్' ఎక్కడ అమలవుతున్నదని నిలదీశారు. సోమవారం ఆమె గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'పార్టీ కోసం ఏండ్ల నుంచి పనిచేస్తున్నాను. మహిళా కాంగ్రెస్ తరపున ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. కానీ నా లాంటి వాళ్లకు పార్టీలోగానీ, ప్రభుత్వంలోగానీ తగిన గుర్తింపు లభించడం లేదు. పార్టీలు మారిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఓడిపోయే గోషామహల్ సీటును నాకు అంటగట్టారు. తర్వాత పట్టించుకోవడమే మానేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలైన నా ఫోన్‌కు స్పందన లేదంటే ఇక మిగతా వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి. ఇప్పటి వరకు ఎన్నో అవమానాలు ఎదురైనప్పటికీ వాటన్నింటిని దిగమింగాను. సరైన న్యాయం జరుగని నాలాంటి వాళ్లు ఎంతో మంది ఉన్నారు. ఓ సాటి మహిళకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకునే బాధ్యత దీపాదాస్ మున్షీకి లేదా? అసలు ఆమె ఫోన్ ఎత్తకపోవడానికి కారణమేంటి? పార్టీ మహిళా అధ్యక్షురాలికి ఇచ్చే గౌరవం ఇదేనా? పార్టీ జెండాలు మోసిన మా లాంటి వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని కేసీ వేణుగోపాల్‌లాంటి అగ్రనేతల దృష్టికి తీసుకెళ్తాను' అని పేర్కొన్నారు.

వ్యవసాయశాఖ బదిలీల్లో తీవ్ర జాప్యం

- మూడుసార్లు వాయిదా.. ఉద్యోగుల్లో అయోమయం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ బదిలీల ప్రక్రియలో తీవ్ర జాప్యం కొనసాగుతున్నది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడింది. తాజాగా చేపట్టిన ప్రక్రియ కూడా నెమ్మదిగా సాగుతుండటంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జూలై 20 నాటికి బదిలీలకు ప్రభుత్వం గడువు విధించింది. ఈ గడువును పెంచిన ప్రభుత్వం జులై 31 వరకు అవకాశం ఇచ్చింది. ఈ నెల 15లోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు.. ఇప్పటివరకు ఏఈవో, ఏవో బదిలీలను మాత్రమే పూర్తిచేశారు. ఆ తర్వాత నాలుగు రోజులుగా పైస్థాయి బదిలీలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో అసలు ఇప్పుడైనా బదిలీలు పూర్తవుతాయనే సందేహాలను ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ శాఖ బదిలీల ప్రక్రియలోనూ తీవ్ర గందరగోళం నెలకొన్నది. తప్పుల తడకగా సీనియార్టీ జాబితా రూపొందించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బదిలీ అయిన ఏఈవోలకు, ఏవోలకు బదిలీ అర్డర్లు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొనడంతో వారికి ఎదురుచూపులు తప్పడంలేద